





"రాజీ ఎంత సేపు యింకా నీ ముస్తాబు. అవతల బస టయిమ్ అయిపో తున్నది." అరిచాడు ఆనంద్, ఆరవసారి ఆదుర్దాగా వాచీవంక చూసుకొంటూ.

"ఇదిగో అయిపోయిందండి. ఒక్క నిమిషం" తాపీగా సమాధానం యిచ్చింది రాజీ.

"ఇదిగో అయిపోయిందనటం . యిది నూట ఒకటోసారి. యిట్లాగే ఆలస్యం చేస్తే ఫస్టుబస్సు కాదుగదా రెండో బస్సుకి కూడా అందుకోలేము. త్వరగా కానీయ్" అంటూ మళ్ళీ ఇంకోసారి వాచీవంక చూసుకున్నాడు.

"అయ్యయ్యో! యింకా పావుగంటే వుంది త్వరగా....." ఆనంద్ మాటలు పొంతంకాక ముందే. ఆనంద్ ఎదురుగా వచ్చి నిలబడింది రాజీ.

"అమ్మయ్య బ్రతికించావు" అనుకొని పరుగులాంటి నడకతో బయటకు వచ్చి రిక్షాని కేకవేశాడు.

ఈ లోపల తలుపుకి తాళం వేసి బయ టకు వచ్చింది రాజీ. ఆదరాబాదరాగా రిక్షాలో చేరారు యిద్దరూ.

రిక్షా సొంతం బస్సాండు ఆవరణలోకి సమీపించకుండానే రిక్షాలోంచి క్రిందకు దూకి, రిక్షావాడి చేతిలో రూపాయి నోటు కుక్కి, రాజీ చెయ్యి పటుకొని బస్స్టాండ్ లోకి ఆదరా బాదరాగా పరుగెత్తాడు.

"ప్లాట్ఫారం ఖాళీగా ఉంది. అంటే బస్ వెళ్ళిపోయిందన్నమాట ఏమో అసలు బస్ ఇంకా ప్లాట్ఫారం మీదకు రాలేదేమో. ఒక్క రెండు నిమిషాలు లేటుగా బయలుదేరితే బాగుండును" అనుకొంటూ "ఎంక్వయిరీ" వైపు నడిచాడు.

"ఎంక్వయిరీ"లో కూర్చొన్నా మె. ఫోన్లో ఎవరితోనో మాట్లాడుతున్నది. ఒక్కక్షణం ఓపికపట్టాడు. అయినా ఆమె ఫోనులో అలాగే మాట్లాడుతున్నది. ఓపిక నశిస్తున్నది ఆనంద్లో. ఇక ఉండబట్ట లేక—

"ఎక్స్క్యూజ్మి మేడమ్. తెనాలి ఫస్టబస్ యెన్నింటికి?" అడిగాడు.

ఆమె ఫోనుకి చెయ్యి అడ్డంపెట్టి ఏమి టన్నట్లు చూసింది. మళ్ళీ చెప్పాడు ఆనంద్.

"అయిదవ నంబర్ ప్లాట్ఫారంమీద చూడండి వుంటుంది" అని చెప్పి మళ్ళీ ఫోన్లో మాట్లాడ సాగింది.

తను యిప్పుడేగా చూసింది. అయిదో నంబర్ ప్లాట్ఫారం మీద బస్ లేదు. అయినా అనుమానమొచ్చి బయటకు వచ్చి తొంగిచూశాడు. లేదు.

"లేదు మేడమ్."

అప్పటికీ యింకా ఆమె ఫోనుమాట్లాడుతూనేవుంది ఆమెదగ్గరనించి ఫోనులాగేసుకోవాలన్నంత కోపం వచ్చింది. అయినా నిగ్రహించుకొన్నాడు.

ఆమె ఫోను పెట్టేసింది.

"అమ్మయ్య" అనుకొన్నాడు.

"ఏమిటన్నట్లు" మళ్ళీ చూసింది.

"లేదండీ" అన్నాడు

"ఏమిటి? లేదు"

"అదేనండీ తెనాలి బస్సు"

"అయితే వెళ్ళిపోయిందన్నమాట"

"ఏ బస్సు వున్నదో. ఏ బస్సు లేదో తెలియకుండా కౌంటర్లో ఎలాకూర్చున్నావు తల్లీ" అనుకున్నాడు మనస్సులో విసుగ్గా.

"మళ్ళీ తరువాత బస్ ఎన్నింటికి?

"ఆరుగంటలకి" చెప్పింది.

"ఇంకా యిరవై నిమిషాలు ఉందన్న మాట. ఒక్క అయిదు నిమిషాలు

ఫోన్ : 61001

## వంశీ ఆర్ట్ థియేటర్స్

న్యూ నల్లకుంట, హైదరాబాదు-500 044

### మా ప్రచురణలు

| | రూ. |
|---|---|
| కి.శే. కృష్ణశాస్త్రి జ్ఞాపకాలు(శాస్త్రిగారి స్వీయరచన) | – 2 |
| ఉప్పెన-తుఫానుపై ప్రముఖ కవులకవితా సంకలనం | – 5 |
| శ్రీ కృష్ణమూర్తి మధుర గీతాలు | – 2 |
| శ్రీ కోకా రాఘవరావ్ స్వర్ణోత్సవ సంచిక | –10 |

### త్వరలో వెలువడే

| | |
|---|---|
| శ్రీ రాయప్రోలు సాహిత్య సౌందర్య దర్శనం | – 6 |
| శశికిరణాలు- శ్రీ శశిధర్ కవిత | – 6 |
| సుషుప్తి నుంచి మేలుకో-శ్రీమతి శారదా అశోక వర్ధన్ కవిత | – 6 |

గమనిక: పోస్టల్ ఖర్చులు ఉచితం.

ముందొస్తే ఈపాటికి సగం దూరంలో ఉండేవాళ్ళం" అనుకొంటూ ఎంక్వయిరీ ఆఫీసు నుంచి రాజీ దగ్గిరకు వచ్చాడు.

"వెళ్ళిపోయిందాండీ?" అడిగిందిరాజీ;

"ఆఁ మనం ఆలస్యంగా వస్తున్నామని. అది మనకోసం ఉంటుంది వెళ్ళిపోక" అన్నాడు కోపంగా.

"ఈ మాత్రం దానికే అంత బాధపడతారు దేనికి. అరగంటకో బస్సు వుంది. ఇది కాకపోతే ఇంకొకటి."

"ఆఁ కబుర్లు బాగానె చెపుతావు. వారం రోజులు శెలవు కోసం ట్రై చేస్తే, ఒక్క రోజు శెలవు దొరికింది. అదయినా మేనేజర్‌ని గంటన్నర బ్రతిమాలితే ఈ ఒక్క రోజు గ్రాంట్ చేసాడు. అది కూడా ఇక్కడే ఖర్చు అయిపోతే ఇక పెళ్ళికి ఎప్పుడు వెళ్ళాలి."

"శెలవు దొరక్కపోతే మీరేం చేస్తారు"

"ఆ గోపిగాడి సంగతి నీకు తెలియదు. పెళ్ళికి వారం రోజులు ముందుగా రమ్మన్నాడు. తీరా మనం పెళ్ళి రోజున. అదీగాక యింకా గంటలో పెళ్ళనగా బయలు దేరాము. యిక వాడి చేతిలో తిట్లుతప్పవు.

"అదేమిటండీ మీ మేనేజర్‌కి భయపడినట్లు భయపడతారు." అంది రాజీ నవ్వుతూ.

అంతలో బస్ వచ్చింది.

బస్ సొంతం. ప్లాట్‌ఫారం మీదకు వచ్చిఆగకముందే బస్ యెక్కాడుఆనంద్.

భర్త ఆదుర్దాని చూసి నవ్వు ఆపుకోలేక పోతోంది రాజీ. ఆరింటికి బయలు దేరాల్సిన బస్. ఆరూ పదయినా బయలు దేరటంలేదు. డ్రైవర్ యింకా సీటుని అలంకరించలేదు.

కిటికిలోంచిబయటకుచూశాడు ఆనంద్. డ్రైవర్ ఖారాకిళ్ళీ నములుతూ తాపీగా సిగరెట్ దమ్ముకొడు తున్నాడు.

యిక ఉండబట్టలేక డ్రైవర్‌ని కేకేద్దామనుకొంటూండగా సిగిరెట్టు అవతల పారెసి. కండక్టరుతో సహా బస్‌లో ప్రవేశించి సీటు అలంకరించాడు.

కండక్టర్ 'రైట్' అని చిన్నగా కేకవేసి టిక్కెట్టు యివ్వటానికి బయలుదేరాడు.

అమ్మయ్య అనుకుని కుదురుగా కూర్చున్నాడు ఆనంద్.

ఊరి పొలిమేరలు దాటి ట్రంక్ రోడ్డుపై పరుగెడుతున్నది బస్.

ఇందాకట్నించి హడావిడిలో తను సిగరెట్ త్రాగటం మరచిపోయాడు.

జేబులోంచి సిగిరెట్టుపెట్టె, అగ్గిపెట్టె బయటకు తీశాడు.

సిగిరెట్టు వెలిగిస్తుండగా డ్రైవర్ సడన్ బ్రేకు వేసాడు. ఆనంద్. రాజీలతోపాటు దాదాపు బస్సులోని వారందరూ ముందు సీట్ల కడ్డీలకు తమ తలలను "ఢీ" కొట్టించారు.

అందరు ఒక్కసారిగా నిలబడి బయటకు చూసాడు. అక్కడకు పది గజాల దూరంలో సన్నటి మలుపు వున్నది. ఆ మలుపులో ఏక్సిడెంటు జరిగింది. ట్రాఫిక్ అంతా బంద్ అయిపోయింది. బస్సులో వాళ్ళందరు దిగి ఏక్సిడెంటు జరిగిన చోటుకు వెడుతున్నారు. ఆనంద్ కూడా దిగి ఎక్సిడెంట్ జరిగినచోటుకు వెళ్ళాడు.

ఒక బస్సు. లారీ చాలా ఘోరంగా గుద్దుకొన్నాయి. లారీ డ్రైవర్ లారీ లోపలే అతుక్కుపోయాడు నిర్జీవిగా. బస్సులో ముందుసీట్లలో కూర్చున్నవాళ్ళు ఆరుగురికి ప్రాణాలు పోయాయి. డ్రైవర్‌తో సహా. యింకా కొంత మందికి గాయాలు తగిలినాయి.

శవాలు యింకా అలాగే ఉన్నాయి.

ఆనంద్‌కు యిది అంతా ఏదో అపశకునంలా తోచింది. ఏదో గుర్తుకు వచ్చి బస్ "బోర్డు" వంకచూశాడు అంతే....

ఒక్కసారిగా అదిరిపడ్డాడు.

అది తాము ఎక్కాల్సిన తెనాలి ఫస్ట్ బస్.

గభాల్ని వెనక్కి తిరిగాడు. అక్కడనుంచి. గుండె దడదడా కొట్టుకుంటుంది.

ఏదోసామెత గుర్తుకువచ్చిందిఆనంద్‌కి

"ఆలస్యం అమృతం విషం" అంటారు కాని అది శుద్ధఅబద్ధం!

"ఆలస్యం విషం అమృతం" ఇదే నిజమైన కొటేషన్" అనుకొన్నాడు రాజీకి మనస్సులోనేకృతజ్ఞతలు చెప్పుకుంటూ

★

## మా పాఠకులకు....

పత్రికా ప్రచురణకు అవసరమైన న్యూస్‌ప్రింటు, ఇతర ముడి ఫిలిం వస్తువుల ధరలు పెరిగినందున ఏప్రియల్ 4 వ తేదీన వెలువడే సంచిక నుండి ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక ధర తప్పనిసరిగా పెంచవలసిన పరిస్థితి ఏర్పడింది.

### కొత్తరేట్ల ప్రకారం చందా వివరములు:

### ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక

విడిప్రతి: 90 పైసలు

| | ఏజంటు ద్వారా రు. పై | పోస్టు ద్వారా రు. పై |
|---|---|---|
| 3 నెలలకు | 11-70 | 12-35 |
| 6 " | 23-40 | 24-70 |
| 12 " | 46-80 | 49-40 |

పత్రిక నిర్వహణ వ్యయం ఎంతగానో పెరిగినప్పటికి ఆ భాగంలో కొంత మేరకు మాత్రమే పాఠకులు భరించవలసి వచ్చినందుకు సహృదయతతో పరిస్థితులను అర్థంచేసుకొని మాతో సహకరించవలసినదిగానూ అభిమానులను కోరుతున్నాము.

బిజినెస్ మేనేజరు

"ఆంధ్రజ్యోతి"

N·B: 4-4-1980 తేదీకి పూర్వపు పోస్టలు చందాల గడువు కొత్త రేట్ల ప్రకారము సవరించబడును.